డిపోల్లో యూరియా కొరత

- భారీ స్థాయిలో నత్రజని వాడకం
- నానో ఎరువులపై ఆసక్తి చూపని రైతన్నలు

తాడేపల్లి రూరల్: ఈసారి రబీలో వరి, వేరుశనగ, సజ్జ పంటలు వేసి ఆశించిన లాభాలు పొందలేకపోయిన రైతులు ఖరీఫ్‌లో ఆ నష్టాలను పూడ్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. తొలి పంట మొత్తం పెట్టుబడులు, కౌలు సొమ్ము చెల్లించడానికి సరిపోతుండగా రెండో పంటలోనే కొంత మిగిలేది. దీంతో రైతులు ఖరీఫ్‌లో వీలైనంత ఎక్కువ దిగుబడి పొందాలన్న ఉద్దేశ్యంతో అధికంగా యూరియాను వాడుతున్నారు. ఎకరానికి 5–6 బస్తాల వరకు వాడుతున్నారు. ఇలా అతిగా ఎరువులు వాడడంతో నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. చీడ పీడల ఉధృతి సైతం బాగా ఉంటోంది. వాటి నివారణకు మళ్లీ పురుగు మందులు వాడడంతో పెట్టుబడి ఎక్కువ అవుతోంది. మరోవైపు ఖరీఫ్‌లో యూరియా సరిపోక పక్క జిల్లాల నుంచి తెప్పించాల్సి వస్తోంది. అధిక దిగుబడుల కోసం ఎక్కువగా బస్తాలు వినియోగిస్తుండడంతో వ్యవసాయ అధికారులు ఆందోళన చెందుతున్నారు. రైతులు ఎకరాకు 10 బస్తాల చొప్పున యూరియాను వాడుతుండడంతో కొరత అధికంగా ఉంటోందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. డిపోలు, రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిల్వలు లేకపోవడంతో గత పది రోజులుగా రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఏర్పడింది.

ఇలా వినియోగిస్తే మేలు..

వరి పంటకు సాధారణంగా ఎకరానికి 48 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ అవసరమవుతాయి. రసాయన ఎరువుల రూపంలో


ఎరువుల బస్తాలు


పురుగు మందులు

అయితే 90 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ, 30 కిలోల ఎంవోపీ కావాలి. అయితే పొటాష్, డీఏపీలకు బదులు రైతులు యూరియానే అధికంగా వినియోగిస్తున్నారు. ఫలితంగా నేల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూరియా నిర్ణీత పరిమాణం కంటే ఎక్కువగా వాడితే భూమి ఆరోగ్యం దెబ్బతింటుందని అధికారులు చెబుతున్నారు. నత్రజని మొక్కలలో పత్రహరితం, డీఎస్ఏ, ఆర్ఎస్ఏ ఉత్పత్తి, మాంసకృత్తులు, నాణ్యమైన దిగుబడుల సాధనకు ఉపయోగపడ్డా.. అదేం బ్రహ్మ పదార్థం కాదని అంటున్నారు. యూరియాతో పాటు ఇతర పోషకాలు (భాస్వరం, పొటాష్) ఉన్న ఎరువులు సమపాళ్లలో వాడడంతో నేల ఆరోగ్యం మెరుగుపడి దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు. అధిక మోతాదులో యూరియా వాడితే పైరు మెతకబడి పురుగులు, తెగుళ్ల ఆశించే ఆస్కారముందని.. ఇతర పోషకాలూ తగ్గి నాణ్యత దెబ్బతింటుందని అంటున్నారు.

నానో ఎరువులపై రైతుల అనాసక్తి..

నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు ఓ వైపు వ్యవసాయ అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. అయితే అవి శాస్త్రీయంగా నిరూపణ కాకపోవడంతో రైతులు అనాసక్తితో ఉన్నారు. అర లీటరు నానో యూరియా రూ.220కు లభిస్తుండగా, ఎకరా పొలం పిచికారీకి సరిపోతుంది. అయితే రైతులు ఒక్కో యూరియా బస్తాను రూ.270 కొని పది చొప్పున ఎకరాకు వినియోగిస్తున్నారని వ్యవసాయ అధికారులు అంటున్నారు. నానో యూరియా వల్ల భూసారం దెబ్బతినదనీ.. కేవలం మొక్కలు మాత్రమే పీల్చుకుని ఏపుగా పెరగడంతో పాటు ఆశించినంత దిగుబడులు ఇస్తాయని చెబుతున్నారు. అయినా రైతుల్లో వాటి పట్ల ఆసక్తి లేకపోవడంతో కొనేవారు కరువవుతున్నారు.

సలహాలు తీసుకోవాలి..



రైతులు నత్రజని ఎరువులను అధికంగా వాడడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించకుంటే వ్యవసాయం భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. నానో ఎరువుల వాడకం సత్ఫలితాలను ఇస్తాయి. రైతులు భావితరాలను దృష్టిలో పెట్టుకుని ఎరువులను వినియోగించాలి.

– ఎం.శిరీష, తాడేపల్లి మండల వ్యవసాయ అధికారిణి

క్లుప్తంగా

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

ఫిరంగిపురం: మండల పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మేడికొండూరు: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ డి.పుల్లారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని అన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

కార్మికులు పట్టుదలతో పోరాడాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు పట్టుదలతో పోరాడాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు కూరపాటి స్టీవన్, సాంబయ్య, ఆశీర్వాదములతో కలిసి ఆయన కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు 220 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని, అయినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో పిచ్చయ్య, సూర్య ప్రకాష్, సాంబయ్య, గురవయ్య, రమాదేవి, దుర్గా భవాని, బి.అంకయ్య, ఇమాంబి, శారద తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ వార్షికోత్సవం

మంగళగిరి టౌన్: మంగళగిరి ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ 74వ వార్షికోత్సవ వేడుకలను డిపో కమిటీ రీజనల్ అండ్ జోనల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల కోసం ఎన్నో పోరాటలు చేశామని, ఆ పోరాటాల ఫలితంగా సిబ్బంది ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు సాంబశివరావు, సెక్రటరీ నాగేశ్వరరావు, రీజనల్ నాయకులు సత్యనారాయణ, మనోరంజన్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు చిన్ని సత్యనారాయణ, గ్యారేజ్ అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహా లక్ష్మమ్మకు ప్రత్యేక పూజలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహా లక్ష్మమ్మ చెట్టుకు రైతులు, బందావు వారి కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏటా తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం నుంచి ఉండవల్లి సెంటర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ఈ రావిచెట్టుకు బందావు వారు, పట్టణ పరిధిలోని రైతులు పూజలు చేయడం ఆనవాయితీ. ఉదయం 6.30 గంటలకు అమ్మవారికి మంగళ స్నానం, అభిషేకం.. 7.30 గంటలకు పసుపు, కుంకుమ సర్పించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

చేబ్రోలు: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బోయపాలెం డైట్ కాలేజీలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో శుక్రవారం జరిగిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు తెలిపారు. నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కె.బిందు తేజ 'మాదకద్రవ్యాలు పొగాకు నిషేధం' అనే అంశంపై జరిగిన చిత్రలేఖనంలో ప్రథమ స్థానం సాధించి రూ.1500 నగదు అవార్డు గెలుపొందింది. వ్యాసరచనలో 'లింగ సమానత్వం గౌరవం' అంశంపై ఎం.దీక్షిత జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రూ.1000 నగదు గెలుపొందారు. బాలికకు నగదుతో పాటు సర్టిఫికెట్‌ను డైట్ కళాశాల ప్రిన్సిపాల్, నరసరావుపేట ఉప విద్యాశాఖాధికారి సుబాని అందించారు. బహుమతులు సాధించిన ఇరువురు విద్యార్థులను పలువురు అభినందించారు.

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ తక్షణమే ప్రారంభించాలి


ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: రాష్ట్రంలో విద్యాసంవత్సరం ప్రారంభమై నెలపైనే అయినా ఇంత వరకూ విద్యాశాఖ డిగ్రీ అడ్మిషన్లపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం సరైనది కాదని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఉన్నత విద్యామండలి భవన్‌లో చైర్మన్ మధుమూర్తికి శుక్రవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని పీడీఎస్‌యూ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్ మాట్లాడుతూ.. డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ ఆలస్యమవడాన్ని అవకాశంగా తీసుకుని ప్రైవేటు కళాశాలల్లో ముందస్తుగా విద్యార్థులను తమ వద్దకు ఆకర్షిస్తున్నాయన్నారు. అడ్మిషన్ల ఆలస్యంతో ఫలితాలు కూడా ఆలస్యం అవుతాయని.. దీంతో ఏపీ పీజీసెట్, ఐసెట్ వంటి ఉమ్మడి పరీక్షలు వాయిదా పడే అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం డబుల్ మేజర్ విధానాన్ని తీసుకువస్తున్నట్లు ప్రకటన చేసింది కానీ దానిపై ఎటువంటి క్లారిటీ ఇవ్వలేదని, తక్షణమే ప్రభుత్వం స్పందించి క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజేష్, ఉపాధ్యక్షులు మహర్షి, నాయకులు రమణ, శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజామృతం తయారీపై రైతులకు శిక్షణ


శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఫిరంగిపురం: ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు తమ పంటను వేసే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని ఏవో వాసంతి తెలిపారు. మండలంలోని వేములూరిపాడులో శుక్రవారం రైతులకు విత్తన శుద్ధి కోసం వినియోగించే బీజామృతం తయారీ విధానం గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం ద్వారా విత్తనాల మొలక శాతం పెరుగుతుందని చెప్పారు. విత్తనాల ద్వారా భూమిలోకి వచ్చే వైరస్, తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మోడల్ మేకర్ ఇ.వెంకటేశ్వర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు రామకృష్ణ, తిరుపతిరావు, ఐసీఆర్పీలు జోసఫ్‌వాణిమేరి, ప్రభావతి, అమల, అరుణ, కె.పెద్దారావు, రైతులు పాల్గొన్నారు.

భారత రత్న డాక్టర్ బి.సి.రాయ్ పురస్కారాల ప్రదానోత్సవం


వైద్యాధికారులను సన్మానిస్తున్న రామస్వామి

దుగ్గిరాల: సమాజంలో అధ్యాపకుడు జ్ఞానజ్యోతి వెలిగిస్తే.. వైద్యుడు ఆ జ్యోతిని కాపాడుతూ ఉంటాడని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. దుగ్గిరాల పీహెచ్‌సీలో శుక్రవారం ఆయన అధ్యక్షతన జాతీయ వైద్యుల పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా బి.సి.రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామస్వామి మాట్లాడుతూ.. బి.సి.రాయ్ లండన్‌లో వైద్య వృత్తి పూర్తి చేసిన అత్యంత ప్రతిభావంతుడని.. వెస్ట్ బెంగాల్‌కి రెండో ముఖ్యమంత్రిగా సుమారు 14 ఏళ్లు పనిచేశారని అన్నారు. ఆయన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం భారత రత్న అవార్డుతో ఘనంగా సత్కరించిందని గుర్తుచేశారు. అనంతరం వైద్యులు డా.అబ్దుల్ రెహమాన్, డా.ఇందిర, డా.రోహ మున్నీసాలను శాలువాతో సత్కరించి బి.సి.రాయ్ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వి.కృష్ణ ప్రసాద్, జెట్టి బాలరాజు, షేక్.సుభాని, పి.గణేష్, కె.జోగేంద్ర, ఎస్. వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ సమావేశం

తాడికొండ: తాడికొండలో శనివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్) ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తాడికొండలోని షిర్డీసాయి–పర్తిసాయి మందిర కల్యాణ మండపంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొనాలని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పార్టీ అధ్యక్షులు అంబటి రాంబాబు, పార్లమెంటు అధ్యక్షులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, పార్లమెంటు పరిశీలకులు పోతిన మహేష్ పాల్గొననున్నారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో సూచించారు.

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

పూలింగ్‌కు వ్యతిరేకంగా 12వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

తాడికొండ: రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆంధ్ర రాష్ట్ర సమితి అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. పూలింగ్ పేరుతో రెండో విడత సమీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడాన్ని నిరసిస్తూ తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో తమ ఇంటి ఎదుట ఆయన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 12వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల భూములు తీసుకొని ఇప్పటికే 11 ఏళ్లు అవుతున్నా ప్రభుత్వం ఏమీ అభివృద్ధి చేయలేదన్నారు. ముందు భూములు తీసుకున్న రైతులకు న్యాయం చేయకుండా రెండో విడత భూములు తీసుకోవడం దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవీగా కనకదుర్గమ్మ అమ్మవారు



నగరంపాలెం: స్థానిక సంగడిగుంటలోని శ్రీకనకదుర్గ అమ్మవారి గుడి ఆవరణలో అమ్మవారు శుక్రవారం శాకంబరీదేవీగా అలకరించారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు అందించారు. కనకదుర్గ ఆలయ కమిటీ అధ్యక్షులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి(రూప), కార్యదర్శి మూరబోయిన నరసింహారావు, ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఆరవ ఆంజినేయులు, కోశాధికారి కల్లి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పత్రి అప్పారావు, అరవపల్లి సాంబశివరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు

బాబా మందిరంలో ఘనంగా పూజలు



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీశైలంకు చెందిన కళ్యానంద స్వామిజీ వేడుకలకు హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయల కమిటీ ప్రతినిధి ప్రాతూరి శ్రీనివాసరావు స్వామిజీకి చిత్రపటం బహూకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాఠశాల హెచ్‌ఎంలకు పుస్తకాలు అందజేత



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని సదావర్తి అన్నదాన సత్రంలో శుక్రవారం వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు నోటు పుస్తకాలు, పలకలు సత్రం నిర్వాహకులు గుర్రం నాగేశ్వరరావు, ఉషారాణిలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏటా సదావర్తి సత్రం తరుపున 5 మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు పలకలు, పెన్సిల్లు, పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. వాటిని ఆయా పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు అందిస్తారని చెప్పారు. ఏటా ఇటువంటి సేవాకార్యక్రమం తమ సత్రం తరుపున నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సూరి, కొలగాని ఏడుకొండలు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు

తాడికొండ: అనుమానాస్పద స్థితిలో తన కుమారుడు భార్య ఇంటి వద్ద మృతి చెందాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని గరికపాడు గ్రామానికి చెందిన వేల్పూరి శివయ్య(54) ఈ నెల 9వ తేదీన అదే గ్రామంలో ఉన్న తన భార్య వెంకాయమ్మ వద్దకు వెళ్లారు. మరుసటి రోజు ఉదయం అనుమానాస్పద స్థితిలో శివయ్య మృతి చెందారు. భార్యాభర్తల మధ్య గత కొన్నేళ్లుగా వివాదాలు ఉన్నాయని.. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్న నేపథ్యంలో విచారణ చేయాలని ఆమె కోరారు. దీంతో శివయ్య తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



పొన్నూరు: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఆర్.జి.రాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. యూనియన్ నాయకులు వేణుగోపాల్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ డిపో కార్యదర్శి ఏ. ఏ. బేగ్ మాట్లాడుతూ.. 1952 సంవత్సరంలో ఏర్పడిన ఎంప్లాయిస్ యూనియన్ ఇప్పటివరకు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసి హక్కులు సాధించిందని అన్నారు. ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు, కరిముల్లా, ఎస్.రావు ట్రెజరర్ ఖాశీం, సంయుక్త కార్యదర్శి ఎస్‌కె. కరీముల్లా, టి.వి. రామయ్య, జి.రాణి, శివ, బుజ్జి, అమిరుల్ల, గ్యారేజీ నాయకులు ఎంపీ.రావు, లెనిన్, జి.ఆర్. బాబు, ఎల్. వెంకటేశ్వర్లు, మెకానిక్ నాగ సురేష్, పాల్గొన్నారు.

విత్తన తయారీ కేంద్రంలో తనిఖీలు



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ పరిధిలోని తులసీ విత్తన తయారీ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎస్.మోహన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా కర్మాగారం రికార్డులను ఆయన తనిఖీ చేశారు. వివిధ రకాల పత్తి విత్తనాలను నాణ్యతా ప్రమాణాల కోసం పరీక్ష ప్రయోగశాలకు పంపినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఏవో జె.వాసంతి, వ్యవసాయ విస్తరణాధికారి షేక్.సుభానీ, వ్యవసాయ సహాయకులు హకీం, నాగేశ్వరరావు, తేజస్వినీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఫిరంగిపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేటకు చెందిన శివ, బుజ్జి అనే ఇద్దరు వ్యక్తులు కోళ్ల వ్యాపారం నిమిత్తం ద్విచక్రవాహనంపై నల్లపాడు వెళ్లి తిరిగి వస్తున్నారు. వేమవరం అడ్డరోడ్డు పంజాబీ దాబా సమీపంలో ఎదురుగా వస్తున్న కారు మరో కారును తప్పించబోయి వీరి మోటారు సైకిల్‌ను ఢీకొంది. దీంతో బుజ్జి, శివలు కిందపడి గాయాలపాలయ్యారు.

పారిశుద్ధ్య కార్మికుల బైక్ ర్యాలీ


ర్యాలీగా బయలుదేరిన నాయకులు

తాడేపల్లి రూరల్: ఇంజనీరింగ్ కార్మికులకు జీవో ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తాడేపల్లి రూరల్ కొలనుకొండ, వడ్డేశ్వరం, కుంచనపల్లి, ఇప్పటం, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, మెల్లెంపూడి గ్రామాల్లో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. గత 12 రోజులుగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమకు జీవో ప్రకారం రావాల్సిన జీతాల కోసం నిరాహార దీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన జీతాల సమస్య పరిష్కరించుకుంటే జూలై 12వ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, ఏపీ మున్సిపల్ తాడేపల్లి మండల పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు మేకల డేవిడ్, చొక్కా మరియదాసు, వెంకటేశ్వర్లు, పాతూరు అశోక్, ప్రాతూరు నాగేశ్వరరావు, బండారు రవికుమార్, కనపాల పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాల్యాద్రి

తాడేపల్లి రూరల్: ఈనెల 13వ తేదీ ఆదివారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు తొలగించాలని, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆదానీ కంపెనీ విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ ఛార్జీల బాదుడు ప్రారంభమైందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, జొన్నకూటి నవీన్, యనమల బర్నబాస్, రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి విజయభాస్కరరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నీరుడు దుర్గారావు, సీఐటీయూ నాయకులు కోట బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లి రూరల్: జాతీయ డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకుని తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ఎంపీపీ ఎలిమెంటరీ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌యూవో సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ఏడీస్ దోమకాటు ద్వారా డెంగీ వ్యాధి రావడానికి అవకాశం ఉందని వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ శివశంకరరావు, శ్రీనివాసరావు, విద్యార్థులు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యం చేకూరుతుందని ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని కొండమెట్లబజార్, రాజాపేట, లక్ష్మీపురం, ప్రధాన వీధులలో నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. చెత్తను రోడ్డుపై వేయకూడదని ప్రజలకు వివరించారు. ఆయన వెంట ఏవో ఏకే బాబు, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగుల అవసరాలు తీర్చడమే మా లక్ష్యం


కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ డైరెక్టర్ సాల్మన్‌పాల్

మేడికొండూరు: దివ్యాంగుల అవసరాలు తీర్చడమే మా లక్ష్యమని ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ అన్నారు. శుక్రవారం పేరేచర్ల గ్రామంలోని ల్యాంప్ సంస్థ కార్యాలయంలో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ సెంటర్‌లో ఫిరంగిపురం, మేడికొండూరు, ప్రత్తిపాడు మండలాలలోని దివ్యాంగుల పిల్లలకు విద్య, రవాణా ఖర్చుల నిమిత్తం అవసరమైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న విప్పర్ల విజయభాస్కర్ మాట్లాడుతూ.. ల్యాంప్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సాల్మన్ పాల్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ స్పీచ్ థెరపి ఉపాధ్యాయురాలు సరళ దేవి, సంస్థ కోఆర్డినేటర్ షేక్ బాజీ, దివ్యాంగుల పిల్లలతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.